క్లుప్తంగా

పచ్చదనంతో గార్డ్స్ యూనిట్



విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఏపీఎస్పీఎఫ్) విజయవాడ గార్డ్స్ యూనిట్‌ను ఐజీ బి.వెంకట్రామిరెడ్డి శుక్రవారం సందర్శించారు. అసిస్టెంట్ కమాండెంట్ మల్లికార్జున ఆధ్వర్యంలో యూనిట్ ఆవరణలో నాటిన పలు రకాల మొక్కలను ఆయన పరిశీలించారు. తులసీ వనంతో పాటు వివిధ రకాలైన మొక్కలతో ఆవరణ పూర్తిగా పచ్చదనంతో నిండి ఆహ్లాదాన్ని పంచడంతో ఐజీ వెంకట్రామిరెడ్డి ముగ్ధులయ్యారు. ఆ పరిసరాల్లో తాను కొన్ని మొక్కలు నాటారు. కార్యాలయం ఆవరణలో పచ్చదనాన్ని అభివృద్ధి చేసిన సిబ్బందిని అభినందించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో విజయవాడ జోనల్ కమాండెంట్ శంకరరావు, సీఐ కామేశ్వరరావు, ఎస్ఐ ఫణికుమార్ పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జ్ పనుల పరిశీలన



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం మధురానగర్‌లో నిర్మిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులను నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా రైల్వే శాఖ సమన్వయంతో త్వరలో రైల్వే అండర్ బ్రిడ్జ్‌ని అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కనకదుర్గ వారధి వరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా డైరెక్ట్‌గా వెళ్లే అవకాశం ఈ రోడ్ ద్వారా కలుగుతుందని చెప్పారు. ప్రజల రాకపోకలకు ఏర్పడుతున్న అసౌకర్యాన్ని దూరం చేసేందుకు రైల్వే అండర్ బ్రిడ్జ్ ఒక మంచి ప్రాజెక్ట్ అని తెలిపారు. రైల్వే శాఖ కూడా పనులను త్వరితగతిన పూర్తి చేస్తోందని పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన కుమార్తె కనిపించడం లేదంటూ తల్లి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీ బ్లాక్ నెం 193లో భార్యాభర్తలైన బివర దుర్గా నాగేశ్వరరావు, జ్యోత్స్న(32) నివాసం ఉంటున్నారు. వీరిది ప్రేమ వివాహం. వీరికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం. ఈనెల 21వ తేదీన భార్యాభర్తలిద్దరికి చిన్నపాటి గొడవ జరగడంతో జ్యోత్స్న ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త దుర్గానాగేశ్వరరావు భార్య కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో అత్త గీతకు ఫోన్ చేసి చెప్పాడు. అత్త, అల్లుడు బంధువులు, తెలిసిన వారిని విచారించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

29లోపు వ్యాపార లైసెన్సులను రెన్యువల్ చేయించుకోవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ పరిధిలో వివిధ వ్యాపారాలు నిర్వహించుకునేవారు తమ వ్యాపార లైసెన్స్‌లను ఈ నెల 29వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా సంబంధిత సచివాలయాల్లో లేదా సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ట్రేడ్ లైసెన్స్ రుసుము చెల్లించి రెన్యువల్ చేయించుకోవచ్చని నగరపాలక సంస్థ కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటివరకు సుమారుగా 60 శాతం మంది వ్యాపారస్తులు మాత్రమే వారి లైసెన్స్‌లను రెన్యువల్ చేయించుకున్నారని, మిగిలిన వ్యాపారస్తులు కూడా ఈ నెల 29 లోపు తప్పనిసరిగా రెన్యువల్ చేయించుకోవాలని సూచించింది. ఆ తరువాత అయితే 25 శాతం అపరాధ రుసుముతో లైసెన్స్‌లను రెన్యువల్ చేయించుకోవల్సి ఉంటుందని పేర్కొంది.

అక్కినేనికి స్వరాభిషేకం



విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, గీతాంజలి మ్యూజికల్స్ వేదగంగోత్రి ఫౌండేషన్ ఆధ్వర్యాన సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. వేటూరి పాటల పరిశోధకుడు డాక్టర్ జయంతి చక్రవర్తి ఆధ్వర్యంలో గాయనీ గాయకులు డాక్టర్ భాగ్యశ్రీ, రూపశ్రీ, జానపద గాయకుడు దామోదర గణపతిరావు అక్కినేని నటించిన చిత్రాల్లోని పాటలను మధురంగా ఆలపించారు. గీతాంజలి మ్యూజికల్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ జయంతిచక్రవర్తి మాట్లాడుతూ అక్కినేని స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. తొలుత అక్కినేని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నగరాన్ని అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదే

- 48వ డివిజన్‌లో గడప గడపకు మన ఆసిఫ్
- కొండ ప్రాంతాల్లో విస్తృత పర్యటన



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఆసిఫ్ తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. 48వ డివిజన్ పరిధిలోని 154వ సచివాలయం పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ఆసిఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్ నుంచి ప్రారంభమైన కార్యక్రమంలో కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి, మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. సచివాలయం పరిధిలోని బ్రహ్మంగారి మఠం, వాటర్ ట్యాంక్ రోడ్డు, కటికల మస్తాన్ వీధి, చర్చి వీధి, సారంగం రోడ్డులో కార్యక్రమం సాగింది. కొండ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లిన ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ ఆదిలక్ష్మి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. ప్రతి ఇంటిలో మూడు నుంచి ఆరు సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పడంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి రెండో దఫా సీఎం అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. విజయవాడ నగరాన్ని అత్యంత వేగంగా అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే అని అన్నారు. నగరాభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని, 48వ డివిజన్‌లో సుమారు రూ.15 కోట్ల వ్యయంతో మంచినీటి పైపు లైన్లు, రోడ్లు, మెట్లు, రిటైనింగ్ వాల్స్ నిర్మాణం చేపట్టామన్నారు.

పశ్చిమలో మూడోసారి వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

పశ్చిమ నియోజకవర్గంలో మూడోసారి వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడుతుందని షేక్ ఆసిఫ్ అన్నారు. వైఎస్సార్ సీపీ చేసిన అభివృద్ధిని చూసి ప్రజలందరూ వైఎస్సార్ సీపీని గెలిపించుకుంటామని చెబుతున్నారన్నారు. నియోజకవర్గంలో రూ.800 కోట్ల అభివృద్ధి పనులు చేశారన్నారు. కార్యక్రమంలో జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, డివిజన్ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు(జగ్గు), అయితా కృష్ణకిశోర్, కోళ్ల రజని, షేక్ మొహర్రాజ్, వానపల్లి త్రిమూర్తులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు దేరంగుల రమణ, మజ్జి శ్రీనివాస్, దుక్క దుర్గారావు, ఎస్‌కే బడే, తొత్తడి వరలక్ష్మి, రాళ్లపల్లి లక్ష్మి, చలమలశెట్టి జగదీష్, గురుమూర్తి, దుర్గారావు, నాగరాజు, పిళ్లా ఏసు పాల్గొన్నారు.

మైనార్టీలను దగా చేసిన చంద్రబాబుకు బుద్ధి చెప్పాలి

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్



మసీదు పెద్దలను ఆప్యాయంగా పలకరిస్తున్న ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నలభై ఏళ్ల ఇండస్ట్రీ, పద్నాలుగేళ్ల ముఖ్యమంత్రిని అని చెప్పుకుంటున్న చంద్రబాబు ఏనాడైనా ముస్లిం మైనార్టీలకు మేలు చేశాడా అని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ ప్రశ్నించారు. అన్నేళ్ల పాలనలో తన మంత్రివర్గంలో ముస్లిం మైనార్టీకి స్థానం కల్పించక పోవడం అతనికి మైనార్టీలపై ఉన్న ప్రేమకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. చిట్టినగర్ కుండల బజార్ ఐజాక్ వీధిలోగల హుస్సేని మసీదులో శుక్రవారం ఆయన వక్ఫ్‌బోర్డ్ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్‌తో కలిసి ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు ఏ ప్రభుత్వంలో మేలు జరిగిందో, ఏ ప్రభుత్వంలో మోసం జరిగిందో ఆలోచించుకోవాలని కోరారు. ముస్లిం మైనార్టీల పక్షపాతి కాబట్టే పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించారని, అందుకు ఆయనకు రుణపడి ఉంటానని చెప్పారు. చంద్రబాబు పాలనలో గుంటూరులో జరిగిన సభలో సమస్యలపై ప్రశ్నించిన మైనార్టీ యువతపై దేశద్రోహం కేసు నమోదు చేయించి జైల్లో పెట్టించి చితకబాదిన మైనార్టీల ద్రోహి చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో బలంగా ఉన్న మైనార్టీ సామాజికవర్గాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడ మైనార్టీ వ్యక్తికి ఎమ్మెల్యే సీటు కేటాయించారని తెలిపారు. ఆసిఫ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని సీఎం జగనన్నకు కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ ఆబిద్, యూనస్, బాజీ బాబా, అఫ్సర్, మసీదు పెద్దలు ఎండీ రఫీ, షేక్ షరీఫ్, షేక్ అబ్దుల్లా, సల్మాన్, అస్లాం, షేక్ సంధాని, షేక్ ఖలీల్, సమీల్లా తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే బీసీలకు న్యాయం

ఎంపీ కేశినేని నాని



బీసీ సంఘం నాయకులతో ఎంపీ కేశినేని నాని

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని బీసీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించిన గొప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ విజయవాడ పార్లమెంట్ సమన్వయకర్త, ఎంపీ కేశినేని నాని అన్నారు. బీసీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీరాణి ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర బీసీ నాయకులు ఎంపీ కేశినేని నానిని మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీలను చంద్రబాబునాయుడు కేవలం ఓట్ల కోసం వాడుకుని వదిలేసేవాడని, కానీ జగనన్న బీసీలకు అన్ని రంగాల్లో అత్యధిక ప్రాధాన్యతను కల్పించి వారి అభ్యున్నతికి పెద్దపీట వేశారని కొనియాడారు. వేముల బేబీరాణి మాట్లాడుతూ బీసీలంటే సీఎం వైఎస్ జగన్‌కు అమితమైన ప్రేమ అని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో మాత్రమే బీసీలకు అసలైన గౌరవం లభించిందన్నారు. రాష్ట్రంలోని బీసీలంతా సీఎం జగనన్న వెంటే నడుస్తామని హామీ ఇచ్చారు. బీసీ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడు బెజవాడ గణేష్, ఉపాధ్యక్షులు జగదీష్, ఎడ్ల పద్మ, మైలవరం అధ్యక్షుడు నాని, బెజవాడ శ్రీకాంత్, బాలాజీ, అనసూరి మణికంఠ, షేక్ దర్గా తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అందరికీ అవగాహన కల్పించాలి

క్యాంపస్ అంబాసిడర్స్ స్వీప్ వర్క్‌షాప్‌లో కలెక్టర్ ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాల్సిన అవసరం అధికారులపై ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ముఖ్యంగా అర్బన్ ప్రాంతంలో నిర్లిప్తతను తొలగించి ఓటింగ్ శాతం పెంచేందుకు చేపడుతున్న కార్యక్రమాల్లో కీలక భాగస్వాములు కావాలని క్యాంపస్ అంబాసిడర్స్‌కు పిలుపునిచ్చారు. త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్లను చైతన్యపరచడం-భాగస్వామ్యం చేయడం (స్వీప్) కార్యక్రమంలో భాగంగా క్యాంపస్ అంబాసిడర్స్ (పాఠశాలలు, కళాశాలలు) వర్క్‌షాప్ శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. వర్క్‌షాప్‌ను ప్రారంభించిన అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో జిల్లాలో మిగిలిన నియోజకవర్గాలతో పోల్చితే విజయవాడ అర్బన్ నియోజకవర్గాల్లో తక్కువ ఓటింగ్ శాతం నమోదైందన్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ అర్బన్‌లో 85 శాతానికి పైగా ఓటింగ్ శాతం పెంచే లక్ష్యంగా స్వీప్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఓటు నమోదుకు సువర్ణావకాశం

అర్హత ఉండి ఓటరుగా నమోదు చేసుకోని వారు వెంటనే ఫారం-6 ద్వారా ఓటు నమోదు చేయించుకునేలా చూడాలని కలెక్టర్ ఢిల్లీరావు సూచించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల వరకు ఓటర్ల జాబితాలో తొలగింపు, సవరణలకు అవకాశం ఉందన్నారు. నామినేషన్ల ప్రారంభం వరకు చేర్పులు, బదిలీలకు అవకాశం ఉంటుందని వివరించారు. ఈ విషయాన్ని అంబాసిడర్స్ గుర్తించాలంటూ ఫారం-6, ఫారం-7, ఫారం-8 ప్రయోజనాల గురించి వివరించారు. ఓటర్ హెల్ప్ లైన్, ఫిర్యాదుకు వీలుకల్పించే సీ విజిల్ తదితర ఆన్‌లైన్ వేదికలపై కూడా అవగాహన పెంపొందించుకొని విద్యార్థులకు, ప్రజలకు తెలియజేయాలన్నారు. క్యూఆర్ కోడ్‌తో ఉండే ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్‌లను కూడా ఓటర్లకు ఇస్తామన్నారు. ఈ-ఎపిక్ కార్డును కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

అందుబాటులో ఆన్‌లైన్ వేదికలు

-స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాసరావు

ఆధునిక సాంకేతికత అందరికీ చేరువైన ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు భారత ఎన్నికల కమిషన్ వివిధ యాప్స్, పోర్టల్స్‌ను అందుబాటులో ఉంచిందన్నారు. వీటిపై అవగాహన పెంపొందించుకొని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీవైఈవో కేవీఎన్ కుమార్, జిల్లా ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త కె.రమేష్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సర్వమానవ సౌభ్రాతృత్వం అభిలషణీయం

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ ఆసిఫ్



విష్ణు సమాజ పెద్దలతో ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): కులమతాలకు అతీతంగా అందరూ సోదర భావం, సర్వమానవ సౌభ్రాతృత్వంతో మెలిగినప్పుడు సమాజాభివృద్ధికి దోహదం చేస్తుందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని వెస్ట్ రైల్వేస్టేషన్ దగ్గర గల మాడపాటి క్లబ్‌లో శుక్రవారం సాయంత్రం విష్ణు సమాజం ఏర్పాటు చేసిన సుందా మాత భజన కార్యక్రమానికి ఆసిఫ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విష్ణు సమాజం సభ్యులతో కలిసి ఆయన ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాలలో భిన్న సంస్కృతులు, మతాలు ఉన్నప్పటికీ భిన్నత్వంలో ఏకత్వం మాదిరిగా అందరూ కలిసిమెలిసి ఉండటం భారతదేశం ప్రత్యేకత అన్నారు. కమిటీ సభ్యులు ఓం అగర్వాల్, లాల్జీ చౌదరి, విజయ్ దేవసి, సర్వత్ సింగ్, రాజాసింగ్ మాట్లాడుతూ ఎటువంటి రాజకీయ వివాదాలు లేని ఆసిఫ్‌కు సుందా మాత ఆశీస్సులు ఉంటాయన్నారు. ఆసిఫ్‌ను పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని తెలిపారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. విజయవాడకు చెందిన వాగ్దేవి కూచిపూడి నృత్యాలయకు చెందిన నాట్యాచార సప్పా శివకుమార్ పర్యవేక్షణలో భవ్య, చరిష్మా, హాసిని, సాధన, లాస్యలతో పాటు పలువురు చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి అభినయాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన ఈ ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం అధికారులు చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలను అందజేశారు.

నేత్రపర్వంగా శ్రీవారి రథోత్సవం



స్వామి రథోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి రథోత్సవం శుక్రవారం సాయంత్రం నేత్రపర్వంగా జరిగింది. వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఐదో రోజుకు చేరాయి. అందులో భాగంగా శ్రీవారి రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, వేద మంత్రోచ్చరణ, భక్తుల శ్రీహరి నామస్మరణ, మహిళల కోలాట విన్యాసాలు, చిత్రవిచిత్ర వేషధారణల మధ్య రథోత్సవం కనులపండువగా ముందుకు సాగింది. తొలుత అత్యంత రమణీయంగా అలంకరించిన రథంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. అనంతరం ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. చివరిగా ఆలయ కమిటీ చైర్మన్ గుడిపాటి పాపారావు, ఇతర ప్రముఖులు కొబ్బరికాయలు కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ రథోత్సవం బ్రాహ్మణ వీధిలోని ఆలయం నుంచి ప్రారంభమై పాత పోస్టాఫీస్ సెంటర్, నెహ్రూబొమ్మ సెంటర్, కోమల విలాస్ సెంటర్, రమణయ్య కూల్‌డ్రింక్ షాప్, సామారంగం చౌక్, శేషయ్య వీధి తదితర ప్రాంతాల మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది.

ఘనంగా గరుడ వాహనోత్సవం

స్వామివారి సన్నిధిలో శుక్రవారం ఉదయం గరుడ సేవ వాహనోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. స్వామివారి వాహనాల్లో గరుడ వాహన సేవకు ప్రత్యేక స్థానముందని పండితులు చెబుతారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో పలు ప్రత్యేక హోమాలను, ఇతర సహస్ర నామార్చనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గరుడ వాహనంపై ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి పలు పూజలను నిర్వహించారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంపై గరుడ వాహనం ఆశీనులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని అధిష్టింపజేసి నగర వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ స్వామివారి వాహనసేవల్లో గరుడ వాహనసేవ, రథోత్సవాలు అత్యంత కీలకమైనవన్నారు. వాటిపై ఊరేగే స్వామివారిని దర్శించుకోవటం శుభఫలితాన్ని అందిస్తుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సెక్షన్ పరిధిలోగల 11 కేవీ కొత్త అమ్మవారి టెంపుల్ ఫీడర్ లైన్ మరమ్మతుల నిమిత్తం కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు లలితా బార్ ఏరియా, టీఎంహెచ్ఎస్ స్కూల్, టేనర్‌పేట, రాయప్పరాజు వీధి, కొత్త అమ్మవారి గుడి, ఈద్గా మహల్, మోతీ మసీదు ప్రాంతాల్లో కరెంట్ నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖతో సహకరించాలని కోరారు.

కార్మిక చట్టాలను పాటించకపోతే చర్యలు తప్పవు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వ్యాపార సంస్థలు, దుకాణదారులు కార్మిక శాఖ చట్టాలను పాటించకపోతే చట్టరీత్యా చర్యలు తప్పవని విజయవాడ సర్కిల్-1 అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ తలమాల రాజేష్ హెచ్చరించారు. భవానీపురం ఐరన్‌యార్డ్‌లోగల సొసైటీ కార్యాలయంలో శుక్రవారం వివిధ వర్తక సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపార సంస్థలు/దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరని, రెన్యువల్ గడువు దాటిపోతే మార్చి 2024లోపు గ్రామ/వార్డు సచివాలయాలు లేదా మీసేవ కేంద్రాల ద్వారా రెన్యువల్ చేయించుకోవాలని తెలిపారు. దుకాణాలలో గానీ, వ్యాపార సంస్థల్లో గానీ బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం నేరమని, అటువంటి వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. షాపుల్లో పనిచేస్తున్న కార్మికులందరూ (ఈఎస్ఐ, పీఎఫ్ వర్తించనివారు) ఈ-శ్రమ రిజిస్ట్రేషన్ పొంది ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హత పొందవచ్చన్నారు. సమావేశంలో విజయవాడ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రం రమణయ్య, జనరల్ సెక్రటరీ కొనకళ్ల వాసుదేవ సూర్యశంకర్, ది కృష్ణ డిస్ట్రిక్ట్ డ్రగ్ అసోసియేషన్, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాజేష్‌ను అసోసియేషన్ సభ్యులు సత్కరించారు.

అత్తను దూషించిన కోడలిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అత్తను దూషించిన కోడలిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కలరా హాస్పిటల్ ప్రాంతానికి చెందిన పైడిపాటి లక్ష్మి, దుర్గారావు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. కుమారుడు దుర్గాప్రసాద్ 2015లో ప్రవల్లిక అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అయితే కొంత కాలంగా దుర్గాప్రసాద్‌కు, ప్రవల్లికకు గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దుర్గాప్రసాద్ భార్య నుంచి విడిపోయి తల్లి వద్దే ఉంటున్నాడు. ఈనెల 16వ తేదీన దుర్గాప్రసాద్ తల్లి లక్ష్మి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ప్రవల్లిక తన అత్త వద్దకు వచ్చి నోటికి వచ్చినట్లు దూషించడమే కాకుండా మీ అబ్బాయిని, మిమ్మల్ని చంపుతానని బెదిరించింది. దౌర్జన్యంగా ఇంట్లోకి వచ్చి అత్త చేతులను వెనక్కి తిప్పి పట్టుకుంది. దీంతో లక్ష్మి భయపడి కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి ప్రవల్లికను మందలించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయింది. కోడలు బెదిరింపులు, దాడికి యత్నించడంపై బాధితురాలు లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏపీ ప్రైవేట్ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్, లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ అండ్ సమీర ఈస్ట్ లయన్స్ కంటి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం కృష్ణలంక నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బీ హనుమయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సామాజిక అంశాల సమాహారం.. శ్రీనివాసరావు కవిత్వం



మాట్లాడుతున్న డాక్టర్ పాపినేని శివశంకర్

విజయవాడ కల్చరల్: ముప్వా శ్రీనివాసరావు కవిత్వం సామాజిక అంశాల సమాహారమని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో బందరురోడ్డులోని బాలోత్సవ భవన్‌లో గురువారం ముప్వా శ్రీనివాసరావు రచించిన నాలుగు కవితా సంపుటలోని కవిత్వం ఆధారంగా 366 మంది రచయితలు రచించిన కవిత్వ విశ్లేషణా గ్రంథం 'అనితరుడు' పరిచయ సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాపినేని మాట్లాడుతూ కవి ముప్వా శ్రీనివాసరావు కవిత్వంలో సామాజిక స్పృహ కనిపిస్తోందన్నారు. విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ ఏ సాహిత్య ప్రక్రియకైనా ప్రధాన లక్ష్యం సమాజ శ్రేయస్సేనని అన్నారు. ఆయన కవిత్వంలో నేడు సమాజంలో జరుగుతున్న అనేక అంశాలను ప్రస్తావించారని, సమాజం పట్ల రచయితకు ఉండవల్సిన బాధ్యతను మరోసారి వివరించినట్లు తెలిపారు. సమావేశంలో అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, కవులు రావి రంగారావు, ఖాదర్ మొహిద్దీన్, అరసవల్లి కృష్ణ ముప్వా శ్రీనివాసరావు కవిత్వంలోని అంశాలను సమీక్షించారు. గ్రంథ సంపాదకులు అనిల్ డ్యానీ, పగడిపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన కవులు శ్రీనివాసరావు కవిత్వంతో అనుబంధాన్ని పంచుకున్నారు.

ఘనంగా సంత్ గాడ్గే బాబా జయంతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని రామ్మోహన గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ రజక సంఘం ఆధ్వర్యాన సంత్ గాడ్గే బాబా జయంతిని ఘనంగా నిర్వహించారు. రజక సంఘం ప్రతినిధులు గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గాడ్గే జయంతి సందర్భంగా రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కందగట్ల శ్రీనివాసరావుకు రజక రత్న అవార్డును ప్రదానం చేశారు. ఆయనను ఏపీ రజక సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించి గండపెండేరం తొడిగారు. ఏపీ రజక సంఘం గౌరవాధ్యక్షుడు ఊకోటి శేషగిరిరావు మాట్లాడుతూ సంత్ గాడ్గే బాబా చేసిన సేవలను గుర్తు చేశారు. జంతు సంరక్షణ, నిరుద్యోగులకు ఉపాధి, నిస్సహాయులకు ఆలంబన, పేద యువతీ యువకులకు వివాహం చేయడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. జయంతి వేడుకల్లో రజక సంఘం నాయకులు గోపాలకృష్ణ, కందగట్ల రమేష్, నీలాపు శ్రీనివాసరావు, నీలాపు సాంబశివరావు, మురళీ, కొలనుకొండ మోహన్‌రావు, ఏసీపీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

